# పతి భక్తి

8

"ఇదుగో మంగా ! అయ్యగారు ఎల్లుండి మాలేసుకుంటున్నారు. నువ్వు రేపు తొందరగా వచ్చి, ఇల్లు దులిపి కడగాలి. ఈ నలభై రోజులూ నువ్వు ముందు మా ఇంటికే వచ్చి పెందలాడే ఇల్లు చిమ్మి తుడవాలి."

అయ్యగారి 'మాల' గురించి తెలుసు. అది వేసుకోక ముందు ఆయన చేసే జులుమూ తెలుసు, వేసుకున్నాక ఆయనకి జరిగే 'గారాబమూ' తెలుసు. అమ్మగారి హడావుడీ, ఆయాసమూ తెలుసు.

"రేపు ఇల్లు శుభ్రం అయిపోవాలి" అని మరొకసారి హెచ్చరించిందావిడ.

ఏదెట్టా వున్నా ఆయన 'దీక్ష' తీసుకున్నన్నాళ్ళూ ఆ ఇల్లు నిజంగా గుడి మాదిరిగానే ఉంటుంది. ఇంట్లో కాలు పెట్టగానే లిల్లీపూలు, గులాబీపూల వాసన, అగర్‌బత్తీల వాసన వచ్చి, అచ్చం గుళ్ళోకొచ్చినట్టే ఉంటుంది. తనకి కాస్తేమిటి చాలా పని ఎక్కువే.

'రేపు మందుల కంపెనీ అయ్యగారు దీక్ష తీసుకుంటారంట. అమ్మగారు ఇల్లు కడగాలంది. తొందరగా ఎళ్ళాలి" అంది ముసల్దానితో మంగ, ఇంటికొచ్చి.

"ఏం దీచ్చా?" అది ముసల్ది, మంగ అత్తగారు.

"అయ్యప్ప దీక్ష. నల్లబట్టలేసుకుంటారే, అదీ"

"అబ్బో, అది శానా దూరమంటగా, చాలా డబ్బు ఖర్చైతందటగా'

"అయితేంది. ఆళ్ళకేం తక్కువా. ఇప్పటికి నాలుగేళ్ళ కాణ్ణించి ఎల్తున్నాడాయన" అని పొయ్యి దగ్గరకి వెళ్ళింది మంగ.

అత్తగారికి రాత్రిపూట కళ్ళు కనపడవు. ప్రొద్దున ఇంత ఉడకేసి పిల్లలకి పెడుతుంది. రాత్రి తనదీ 'డూటీ'.

"ఈ సమచ్చరం మన రమేసు కూడా మాలేసుకుంటాడట. ఎర్రబట్టల మాల బవాని మాల" అంది ముసల్ది.

ఏందీ! రమేసు మాలేసుకుంటాడా!

"నీతో అన్నాడా?"

"ఊ. పొద్దుగాల అన్నం తింటా అన్నాడు. మంచిదే గందా. ఈ తాగుడూ, అంతా బంద్" అంది పళ్ళు బయటపెట్టి.

"అప్పటి మాటే" అని పనిలో పడింది మంగ.

ఇంట్లో దేవుడికి ప్రత్యేకం ఒక గది. మంచి మందిరం. గదికి గంటల తలుపు. దేవుళ్ళన్నీ వెండివి. అట్టాంటోళ్ళు మాలేసుకున్నా బావుంటుంది. తనకో గదా? మందిరమా? ఎట్టా జేస్తాడబ్బా రమేసు.

రాత్రి పదింటికొచ్చాడు. వాసన మామూలే, వాగుడూ మామూలే. చేసిన కూర నచ్చదు. అరవడం, కరవడం. మాలేసుకుంటే మంచిదే.

తెల్లారి లేస్తూనే "వొసేయ్ మంగా ! వచ్చే శుక్రవారం నేనూ, నా స్నేహితులూ భవాని మాలేసుకుంటాం" అన్నాడు నిర్ణయించుకున్నట్టు.

'ఏసుకున్నప్పటి మాట గందా!' అని మనసులో అనుకుని "సరేలే" అని ప్లాస్టిక్ బుట్ట పుచ్చుకుని పనికి బయల్దేరింది.

మాలేసుకుంది అయ్యగారే గానీ, పూజ ఏర్పాట్లన్నీ మళ్ళీ అమ్మగారే చెయ్యాలి. దేవుడి పటానికి పూలు పెట్టాలి. దీపారాధన, కుందిలో నూనెవేసి వత్తి తడిపి పెట్టాలి. అగరు బత్తీలు పెట్టీ స్టాండులో అవి గుచ్చి రెడీగా అగ్గిపెట్టె ఉంచాలి. హారతి తిప్పేదాంట్లో కర్పూరం బిళ్ళలుంచాలి. నైవేద్యం పెట్టడానికి పళ్ళూ, పాలు అక్కడ పెట్టాలి. ఆయన ఏవో పుస్తకాలు అరగంట పాటుచదివి గంట మోగించి హారతిస్తాడు. ఈలోగా టేబిల్ మీద 'టిఫినీ' రెడీ చెయ్యాలి..వేడివేడిగా –

హారతిచ్చేటప్పుడు ఇంట్లో అంతా అక్కడికి పరిగెత్తి కళ్ళ కద్దుకుని 'వీబూది' పెట్టు కోవాలి.

ఆయన నల్లబట్టల్తోనే ఆఫీసుకెడతాడు. చెప్పులు వేసుకోడు. అయితేనేంది. కార్లో కాలు క్రింద పెడతాడా ఏంటి? ఇయ్యన్నీ చెయ్యాలంటే రమేసు వల్లౌతుందా! చెప్పుల్లేకుండా బజాట్లో నడవాలంటే ఎంత కష్టం?

"మనకెందుకులే ఆ తిప్పలేవో తనే పడతాడు" అనుకుంది. ఒకపక్క రమేసు మాలేసు కుంటాడంటే 'ఎట్టాగబ్బా?' అనీ వుంది. ఒకపక్క 'బాగానే ఉంటుంది' అనీ ఉంది. అంతలోనే నవ్వు కూడా వచ్చింది. తననేమైనా అడిగాడా ఎట్టా? 'ఏం మంగా నాకు మాలేసుకోవాలనుంది నీకిష్టమేనా? నీ ఉద్దేశం ఏమిటి?' అని.

అసలు ఏ విషయానికీ అడగడు. నిరుడట్లాగే కాస్త పంపూ అదీ వున్న ఇంట్లో ఉంటుంటే, ఇంటాయనతో తగాదా పెట్టుకుని నిమిషాల మీద ఇల్లు మార్చేశాడు. 'ఈ ఇల్లు నీకు నచ్చిందా?' అనడిగాడా? ఇందులో నీళ్ళు లేవు. చచ్చినట్లు మెట్లన్నీ ఎక్కి మోసుకోవాలి. శానామంది మగవాళ్ళు కావిళ్ళేసుకుని నీళ్ళు తెచ్చిపెట్టి పనికిపోతారు. ఈయనకవేం లేవు. కొత్తలో ఏడ్చింది. ఇప్పుడలవాటైపోయింది. తన ఏడుపు వల్ల అయితేనేం, ఇరుగుపొరుగు మగవాళ్ళు తేవడంవల్ల అయితేనేం ఎప్పుడన్నా ఒకరోజు కావిడి భుజానికెత్తుతాడు. అంతలోనే ముసల్ది బాధపడిపోతుంది. "ఓరయ్యోయ్ జాగ్రత్త నాయనోయ్" అంటూ.

మంగ కూడా తన గదిన్నర ఇంటినీ శుభ్రంగా దులిపి కడిగి ముగ్గు పెట్టింది. పనిచేసే ఇళ్ళ దగ్గర ఎవర్నో బ్రతిమిలాడి మామిడిమండలు తెచ్చి కట్టింది. గదిన్నరలో అరగదిని రమేసు 'పీఠం' పెట్టుకోవానికి చీరె అడ్డం కట్టి తయారుచేసింది. ఆ చుట్టుప్రక్కల అదివరకే 'మాల'లు వేసుకున్నవాళ్ళు, వేసుకోబోయేవాళ్ళు, వాళ్ళ తాలూకు అమ్మలు, అక్కలు, భార్యలు, వదినెలు, మంగకి బోలెడు సలహాలు, హితవులూ చెప్పారు.

'ఇదేదో రమేసు మాలేసుకున్నట్టుగా లేదు నేనే ఏసుకున్నట్టుంది' అనుకుంది.

"ఇదుగో మంగా! రమేసుని రేపటాలనుంచీ ఈ 'టిపినీ' బండికాడ ఇడ్లీలు, దోసెలూ తినొద్దని చెప్పు. తానం చేసి సుబ్బరంగా ఇంటోనే వండిపెట్టాలి" అని ఓ అత్తమ్మ చెప్పింది.

"ఇయ్యాల్టి నుంచీ రమేసు 'నీ మొగుడు రమేసు' కాదు. సాచ్చాత్తూ బగమంతుడు, తెలిసిందా? చేసేది శ్రద్ధగా చేసిపెట్టు. పుణ్యం వస్తాది" అంది ఒక వదినె.

"వఱ్రగా మాంసం అదీ తిండం అలవాటుగదా! నాలిక్కి రుచిగా వండిపెట్టు కూర లవీ" అంది ఒక అక్క.

కృష్ణానదిలో స్నానం చేసి ఎఱ్రటి కొత్త బట్టలు వేసుకుని మెడలో రుద్రాక్షమాలతో, నుదుటి మీద గంధం బొట్టుతో అతనింటికి రాంగానే చాలామంది అతని కాళ్ళకి దండం పెట్టారు. తనూ పెట్టింది.

"ఇయ్యాళ 'టిపినీ' ఏం జేసిపెడతావ్?" అన్నాడు రమేసు.

ఈ టిపినీలు చెయ్యడం తనకసలు అలవాటే లేదు. రమేసు ఎక్కడోక్కడ బండిమీదో, చిన్న హోటల్లోనో తనక్కావల్సింది తినేస్తాడు. తనకి ఏ అమ్మగారో పెడుతుంది. ముసల్దానికి 'టిపినీ'ల గోల లేదు. పొద్దున్న యింత చద్దన్నం తినేస్తుంది. పిల్లలిద్దరికీ చెరికాసిని పాలిచ్చి తను పనికిపోతే అన్నం వండి వాళ్ళకి పెడుతుంది. సాచ్చాత్తూ బగమంతుడైన రమేసు రాత్రి మిగిలిన అన్నం ఎట్టా తింటాడు? తప్పుగదా! మాలలు వేసుకున్న రమేసు స్నేహితుల పెళ్ళాలు కూడా 'టిపినీ'లు చెయ్యడం మొదలుపెట్టారు.

"ఈపూటకి రమేసుకి నేను పంపిత్తాలే. రేపట్నించీ ఏర్పాటు చేసుకో" అని 'మాల' వేసుకున్న ఒకాయన భార్య జాలి చూపించింది.

అంతక్రితం రోజే రమేసు బజారుకి వెళ్ళి నాలుగు జతల ఎర్రబట్టలు, రెండు కొత్త తువ్వాళ్ళు, రెండు దుప్పట్లు, ఒక కొత్త చాప కొనుక్కొచ్చాడు.

ఇతరులు వాడినవి తను వాడకూడదని -

"సాయంత్రం రైతుబజారుకెళ్ళి ఇంట్లోకి కావల్సినయ్యన్నీ కొనుక్కొస్తా డబ్బులియ్యి" అంది మంగ.

"నాకాడేడుండయ్. వున్నయ్యన్నీ పెట్టి నిన్న బట్టలు తెచ్చాగదా! నువ్వే ఏదో కానియ్" అన్నాడు.

'భవాని'తో వాదన (మాల వేసుకున్నవాళ్ళని 'భవాని' అనాలి) పెట్టుకోకూడదని 'సరే కానియ్" అంది. రైతుమార్కెట్‌కి వెళ్ళి కూరలు, నారలు, పూలు, బుక్కాయిలు, పళ్ళు, కొబ్బరికాయలు, అగరుబత్తీలు, కర్పూరం బిళ్ళలు, మినప్పప్పు, ఇడ్లీరవ్వ, బొంబాయి రవ్వ, గోధుమ పిండి తెచ్చింది. అట్లాగే బజారుకి వెళ్ళి ఇడ్లీ వండే కుక్కరొకటి కొనుక్కొచ్చింది.

మాల వేసుకున్నవాళ్ళు, వాళ్ళతో మాట్లాడేవాళ్ళు కూడా అబద్ధాలాడకూడదట. అందుకని తను అప్పుడప్పుడు దాచుకున్న డబ్బుతోనే తెచ్చానని నిజం చెప్పింది. మామూలుగా అయితే అప్పు చేసి తెచ్చాననేది.

రమేసేమో రాత్రి కూడా అన్నం తినకూడదు.

పొద్దున 'టిపినీ', మధ్యాహ్నం భోజనం, రాత్రి మళ్ళీ టిపినీ. ఆ 'టిపినీ' ఎంత తిన్నా, 'అన్నం' కాదని మళ్ళీ ఒక బాధ.

మంగ రోజూ ఆరింటికి లేచి, వాకిలి కాస్తా ఊడ్చి, నీళ్ళు తెచ్చిపోసి, పిల్లలకి పాలు కాచి పనికిపోయేది. ఇంటికొచ్చేసరికి పన్నెండు. ఈలోగా అత్తే పిల్లలకి అన్నం పెట్టి, నీళ్ళు పోసేది. తను వచ్చి బట్టలు ఉతికి, రమేసుకోసం ఏదైనా కూర వండేది. తనూ, అత్తా అమ్మగార్లిచ్చిన కూరతో, పప్పుతో తినేవాళ్ళు. రమేసుకి అవి నచ్చవు. మూడు నాలుగురోజుల కొకసారి చేపలో, మాంసమో కావాలి. సాయంత్రం రోజూ 'కోర్టరు' వుండాల్సిందే. ఇప్పుడు మంగ దిన చర్య మారింది.

నాలుగున్నరకల్లా లేవాలి. రమేసు కృష్ణలో స్నానం చేసొచ్చేపాటికి తనూ స్నానం చేసి పూజ ఏర్పాట్లు చెయ్యాలి. టిపినీ చెయ్యాలి. దాంతోపాటు అతనికి మధ్యాహ్నం తిండిలోకి కూర వండాలి. ఇప్పుడు అతను పన్నెండింటికల్లా ఇంటికొచ్చి తిండి తిని వెడుతున్నాడు. తను పనిచోట నుండీ వచ్చి మళ్ళీ స్నానం చెయ్యాలి. ఎందుకంటే విడిచిన బట్టలు ఉతుకుతుంది. తుక్కు పారబోస్తుంది. ఆ బట్టల్తో భవానికి వడ్డించరాదు కదా! ఇన్నిసార్లు విడిచిన బట్టలు మోపెడౌతున్నాయి. ఇంట్లో పీఠం పెట్టినకాణ్ణించి బయటికి వెళ్ళొచ్చినప్పుడల్లా అత్త కూడా చీరె విడిచిపెడుతోంది. చంటిదింకా పక్క తడుపుతూనే ఉంది. ఇంక రమేసు బట్టలు వేరేగా ఉతకాలి. అవ్వనీ ఆరెయ్యాలి. అదయినాక మళ్ళీ పనికి పోవాలి. పని నించి రాంగానే రమేసుకి 'టిపినీ' ఏంజెయ్యాలని ఆలోచన! రోజూ ఒకటే తింటే విసుగ్గదా!

అమ్మగారయితే ఏమిటేమిటో చేసేస్తూ వుంటుంది. ఆటి పేర్లు గూడా తనకి రావు. అయ్యగారి కోసం సుబ్బరంగా వండుతోంది గదా, ఒక్కనాడు గూడా 'నీ మొగుడికి పెట్టుకోవే' అని యివ్వదు. ఆయన తినందే యివ్వగూడదంట గందా.

ఆయన తినేదాకా తనెక్కడుంటుంది.

ఎట్టా చేశావమ్మా అంటే పుస్తకంలో చూసి చేశానంటుంది. గ్యాస్‌పొయ్యిలు, మిక్సీలు ఉంటే ఎన్ని చిత్రాలైనా చెయ్యొచ్చు గందా!

వారం తిరిగేసరికి ముందున్న ఉత్సాహం పోయింది మంగకి. రమేష్ మాత్రం బాగున్నాడు. ఇప్పుడు 'బుడ్డీ' లేదుగదా! కడుపునిండా తింటున్నాడు. బీడీలు కాల్చడంలేదు గదా! దగ్గరకొస్తే కర్పూరం వాసనొస్తున్నాడు. ఇట్టా ఎప్పుడైనా సుబ్బరంగా తన దగ్గరకొచ్చాడా? ఎప్పుడూ సారా వాసన్తోనే సంసారం. తనెంత సుబ్బరంగా ఉన్నా, పూలు పెట్టుకున్నా ఏం లాభం. అతగాడి దగ్గర బీడీ, సారా కంపే గదా. 'భవానీ'ని గురించి ఇట్లాంటి ఆలోచనలు చేస్తే కళ్ళు పోతాయంట. చెంపలేసుకుని దండం పెట్టుకుంది.

కర్పూరం, సెంటువాసన్లు కాకపోతే పోయె, సారాబీడీ వాసన్లు లేకపోతే చాలు.

తెచ్చిన సరుకులు 'ఉష్'న ఎగిరిపోయినయ్. బిక్కుబిక్కుమంటూనే డబ్బులడిగింది.

"నా దగ్గరేడున్నాయ్ భవానీ! నేనూ అప్పుడప్పుడూ పూలూ, కొబ్బరికాయలూ తెస్తానే ఉన్నా గందా! నువ్వే ఏదో చూడు. ఇంక నీ పెట్టెలో ఏవైనా వున్నయ్యేమో" అన్నాడు.

'అవునవును. నువ్వు సంపాదించిందంతా ఎప్పుడైనా నాకిచ్చావా? ఇస్తే ఇట్లా నాలుగిళ్ళ పనీ, ఆ పనీ, పైపనీ ఇన్ని చేసి సంసారం ఈడ్చుకురావాలా నేను. చలికాలం నాలుగు దుప్పట్లు కొందాం అనుకున్నా, పిల్లలకి పాత చీరెలు కప్పుతున్నా' అందామని ఆవేశంగా తలెత్తింది మంగ. మళ్ళీ అతని మొహంలో చిరునవ్వు, నుదుటి మీద గంధం బొట్టు, మెడలో రుద్రాక్షమాల చూసేసరికి తమాయించుకుని

"ఇంక అప్పు తేవాలి" అంది.

"ఇది బగమంతుడి పని కదే మంగా! అట్టా అంటే ఎట్టా? మీ అమ్మగార్ల నెవర్నైనా అడిగి పట్రా" అని వత్తాసు పలికింది అత్తగారు.

'సరే కానియ్ చేసేదేం వుంది' అనుకుని మళ్ళీ అందరి దగ్గరా తలా ఒక వందా అడ్వాన్సు తెచ్చింది. పిల్లలకి జరం వచ్చిందన్నా, ఇంట్లో సరుకులు కొనుక్కోవాలన్నా, చుట్టాలొచ్చారన్నా పది రూపాయలివ్వడానికి వందసార్లు దెప్పే అమ్మగార్లు రమేసు మాలేసుకున్నాడనంగానే డబ్బిచ్చేశారు. పుణ్యం అంటే ఎవరికి ఆశ ఉండదు?

వాళ్ళయితే యిచ్చారు. వచ్చే నెల నించీ జీతంలో తొర్ర కదా!

"నలభై రోజులు మానేసినవాడు ఇంక ముట్టుకోళ్ళీయే. వచ్చే నెలకాణ్ణించి జీతమంతా తెచ్చి నీకే యిచ్చేస్తాడు" అంది అత్తగారు తన కళ్ళు తుడవడానికి. ఆమెకీ తెలుసు రమేసు సంగతి. వచ్చే రెండువేల అయిదువందల్లో ఇంటికొచ్చేది పదిహేనువందలే! మొత్తం తనకిస్తే తనింత కష్టపడ్డం ఎందుకు? తనకీ ఇట్లా ఎంగిలి కంచాలు కడగడం, విడిచిన బట్టలుతకడం యిష్టమా? కాస్త వెసులుబాటుంటే ఏ మిషనో నేర్చుకుని రెడీమేడ్ షాపులో కుట్టడానికి కుదురుతే బావుంటుందని ఎప్పుడూ అనుకుంటుంది. అట్టాగే గడిచిపోతున్నాయ్ రోజులు.

అమ్మగారింట్లో భజన పెట్టారు. ఆ వైభవం వైభవం కాదు. వీధి వీధంతా షామియానా వేశారు. ఆరుతూ మెరుస్తూ ఉండే రంగురంగుల బల్బులు, దేవుడికి పెద్ద మందిరం, ఇంటి కంతా పూల అలంకారం, దానికే ఎన్నో వేలయినయ్యంట. దానికోసం ప్రత్యేకం మనుషులుంటారంట. ఎంతమంది స్వాములో. ఊళ్ళో స్వాములంతా అక్కడే ఉన్నారు. భజన చేసే వాళ్ళకీ చాలా డబ్బులంట. గురుస్వామికి బోలెడు దక్షిణలంట. ఇంక ఆ ప్రసాదాల సంగతి చెప్పడానికి లేదు. అయ్యగారి స్నేహితుల ఇంట్లో తొమ్మిది రకాల స్వీట్లు చేశారని, అమ్మగారు పదకొండు రకాలు చేయించింది.

ఇంటికొచ్చి ఆ వైభవం అంతా 'రమేసు'కి చెప్పింది మంగ.

"అవును ఉన్నంతలో ఎవరికి తగ్గట్టు వాళ్ళు భజన పెట్టుకుంటే మంచిది" అంది ఇరుగమ్మ.

"తప్పకుండా పెట్టించు రమేసు. నీకు కలిసొస్తుంది. ఈసారి కొడుకు పుడతాడు" అన్నాడు పొరుగయ్య.

"అట్టాంటి భజన్లు మనవల్ల కాదు" అంది మంగ.

"ఎంత చెట్టుకంత గాలి. నిన్ను ఆ 'లెవెల్లో' ఎవరు పెట్టించమన్నారు. మనకు తగ్గట్టే మనం పెట్టుకుంటాం. ఏవంటావ్ రమేసూ!" అన్నాడింకో ఆయన.

అప్పటికేం మాట్లాడలేదు రమేసు. 'ఇదంతా ఎందుకు చెప్పానా' అనుకుంది మంగ.

దాదాపు వచ్చే నెల జీతం అంతా అడ్వాన్సు తీసుకుంది.

అదికాక చిల్లరగా అప్పులు చేసింది.

"ఇంక నాకెవరూ అప్పులియ్యరు భవానీ" అంది మంగ.

ఇంకా నలభైరోజులకి పదిరోజులున్నాయి.

తెల్లవారుఝాము చన్నీళ్ళ స్నానాలకి జలుబూ జ్వరం వస్తే వెంటనే డాక్టర్ దగ్గరికి పరిగెత్తక తప్పలేదు. ఒక చెంప ఇంట్లో భవాని పీఠం వుంటే తను మూలుగుతూ పడుకుంటే ఎట్లా? 'భవానీ'కి పాపం ఎవరు చేసి పెడతారు? ఆ జరానికి వంద రూపాయలు వదిలినయ్. చంటిదానికి ఒకటే ముక్కు కారడం. దానికీ మందులు.

"మనం కూడా భజన పెట్టిస్తున్నాం భవానీ" అన్నాడు రమేసు భవాని రెండురోజుల తరువాత.

"ఇంక నాకెవరూ అప్పులియ్యరు భవానీ" అంది మంగ.

"నే జూసుకుంటాలే. నే పనిజేసే కాడ అడిగి తెస్తా" అన్నాడు హుషారుగా.

"మరిప్పడిదాకా ఎందుకు జూసుకోలేదు" అనడానికి ధైర్యం చాల్లేదు.

"నేనో మాట జెబుతా యిను భవానీ. మీరు నలుగురు స్నేహితులున్నారు గందా! నలుగురు కలిసి పెట్టుకోండి. కర్చు కలిసొస్తంది" అంది ఎట్లాగో కూడగట్టుకుని.

"అట్టాగాదులే భవానీ. ఎవురి పున్నెం ఆడిదే. ఈసారి కిట్టాగానీ. మొదటిసారి మాలేసు కున్నాం. వచ్చేసారి అట్టాగే సేద్దాంలే. నీకెందుకు నే జూసుకుంటాగా. నువ్వేం కట్టపడమాక. దేని వాళ్ళు దానికున్నారు. భజన వాళ్ళున్నట్టే ప్రసాదాలు చేసేవాళ్ళున్నారు. అన్నీ నాకొది లెయ్" అన్నాడు.

'పోనీలే బూతులు తిట్టడంలేదు, అస్తమానం చెయ్యి లేవడంలేదు. కాస్త గౌరవంగా మాట్లాడుతున్నాడు అదేచాలు' అనుకుంది మంగ.

స్నేహితుడు సాయిబాబా భజనపెట్టాడు. ఆ మర్నాడు రమేసు కూడా పెట్టాడు. షామియానా వేశాడు. మైకు సెట్టు, లైట్లు కూడా పెట్టించాడు. తనకు నచ్చినట్లు భగమంతుడు మెచ్చేటట్లూ ఏర్పాట్లు చేశాడు. పదకొండు రకాల స్వీట్లు పెట్టలేకపోయినా మూడురకాలు పెట్టించాడు. పనిచేసేచోట ఎంత అప్పు చేశాడో తెలీదు అడిగితే అబద్ధం చెప్పగూడదు కనుక 'ఆ సంగతి ఇప్పుడెందుకులే భవానీ తరువాత చూసుకుందాం' అని దాటేశాడు. అందర్నీ ప్రసాదానికి పిలిచాడు. భగవంతుడి దయవల్ల దీక్ష బాగా జరిగింది. వేలాదిమంది భవాని భక్తుల్లో ఒకడుగా రమేసు అమ్మవారి కొండకి వెళ్ళివచ్చాడు. కృష్ణానదిలో స్నానంచేసి 'మాల' తీసివేశాడు. పీఠాన్ని తీసిపెట్టాడు. ఇప్పుడు రమేసు రంగొచ్చాడు. కాస్త బుగ్గలొచ్చినయ్. మొహం నిగనిగలాడుతోంది.

అతని దీక్ష మంగకో యజ్ఞంలా అయింది.

తను పనిచేసేచోట ఐదువేలు అప్పు చేశానని చల్లగా చెప్పాడు. "పోన్లే అయ్యా! భగవంతుడి కోసం చేశావు నీకోసం కాదుగా తీరుద్దువుగాన్లే" అంది తల్లి.

మంగకి బాగా అలసటగా ఉంది.

"ఏంటోనమ్మా మా ఆయన దీక్ష అయిపోయింది. ఇయ్యాళ్టితో గట్టెక్కాను" అంది మంగ తను పనిచేసే ఓ అమ్మగారితో.

"నువ్వు మీ ఆయన్ను అడక్కుండా దీక్ష తీసుకున్నావనుకో అతను నీలాగా చేస్తాడా?" అందావిడ.

"ఆడాళ్ళకెట్టా కుదుర్తుందమ్మా" అంది మంగ వెంటనే.

"అందుకే అయ్యప్పస్వామి ఆడాళ్ళని రావద్దన్నాడు చాలా తెలివిగా" అంది మళ్ళీ ఆవిడే

"నీకు మీ ఆయన భక్తిగా ఉంటే బావుందా? మామూలుగా ఉంటే బావుందా?" అని ప్రశ్నించింది.

ఏమో నిజంగానే తనకి తెలీదు. దేని కష్టాలు దానివి. సాయంత్రం ఇంటికెళ్ళేసరికి ముసల్ది ఎన్నడూలేనిది తనకోసం లిల్లీపూలు తెచ్చిపెట్టింది.

"రమేసు తొందరగా వస్తానన్నాడు. తొందరగా అన్నం వండు. నువ్వు కూడా తానం చెయ్యి" అంది పళ్ళు బయటపెట్టి నవ్వుతూ.

మంగకి కళ్ళు తిరిగినట్లయింది. ఒళ్ళు నొప్పులుగా ఉంది. తొందరగా తిండి తిని నిద్రపోవాలనుంది. నాలుగురోజులు విశ్రాంతి కావాలి. రమేసు వచ్చాడు. మంచి ఆకలి మీదే వచ్చాడు.

అతనిప్పుడు సాచ్చాత్తూ భగమంతుడు కాడు.

సాచ్చాత్తూ పాత రమేసే.

తెల్లవారి నీరసంగా, పరాకుగా ఇల్లు చిమ్ముతున్న మంగని "అట్లా వున్నావేంటి? మీ ఆయన దీక్ష అయిపోయిందిగా?" అంది అమ్మగారు.

మంగ ఏం మాట్లాడలేదు.

దీక్ష తీసుకోవడానికి తననెట్లా అడగలేదో, రాత్రి కూడా "నీకు వంట్లో బావుందా" అని కూడా అడగలేదు.

"భక్తి అయినా, రక్తి అయినా అనుభవం వాళ్ళది, ఆయాసం మనదీ" అంది ఆవిడ ఒక నవ్వు నవ్వి. ఆ మాటల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది మంగ.

*భూమిక దశాబ్ది ప్రత్యేక సంచిక, నవంబరు-ఫిబ్రవరి 2003*